సాక్షి
వికారాబాద్
మంగళవారం । 19 । ఆగస్టు । 2025



నీళ్లపల్లి.. భక్తజనం ప్రణమిల్లి
జడివానలోనూ నీళ్లపల్లి సమీపంలో కొలువు దీరిన ఏకాంబరి రామలింగేశ్వర స్వామి జాతరకు భక్తజనం పోటెత్తారు. 8లో▸



వర్షం జోరు.. వరద హోరు
వరుస వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. రహదారులన్నీ జలమయంగా మారి గుంతలు పడ్డాయి. 8లో▸



వామ్మో.. కుక్కలు!
వీధి కుక్కల బెడదతో ఆయా గ్రామాల్లో ప్రజలు అడుగు బయట పెట్టాలంటే హడలిపోతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్: పట్టణ శివారులోని కేజీబీవీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా బోటని(పీజీ సీఆర్‌టీ) సబ్జెక్టు బోధించేందుకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తెలిపారు. ఎంఎస్సీ (బోటని) బీఈడీ అర్హత ఉండి ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 19, 20వ తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, పూర్తి వివరాలకు విద్యాలయంలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

నేడు, రేపు స్పాట్ అడ్మిషన్లు

అనంతగిరి: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ డీఈడీ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం మంగళ, బుధవారాల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సీట్లకు 19న, ప్రైవేట్ సీట్లకు 20న ఆయా కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నారని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 77807 40880లో సంప్రదించాలన్నారు.

బాధ్యతలు చేపట్టిన డీటీ సందీప్

తాండూరు రూరల్: తాండూరు డిప్యూటీ తహసీల్దార్‌గా సందీప్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసి డిప్యూటేషన్‌పై ఏడాది పాటు తాండూరు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. మళ్లీ యథావిధిగా తాండూరు డీటీగా విధుల్లో చేరారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి



బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొడంగల్: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలో కలపాలని ఆ సంఘం నాయకులు కోరారు. సోమవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ ఏలో కలిపితే మేలు జరుగుతుందన్నారు. జనాభాకు అనుగుణంగా విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో అవకాశం కల్పించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయంలో సానుకూలంగా ఉన్నారని బీసీ కమిషన్ నివేదిక ఇస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాశ్, ముదిరాజ్ సంఘం నాయకులు వేణుగోపాల్, సత్యపాల్, వెంకటయ్య, నర్సప్ప, బాలయ్య, మధుసూదన్, హన్మంతు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోండి



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాండూరు: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి, తాండూరు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీతతో సోమవారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. తాండూరులో డెంగీ కేసులు ప్రబలకుండా చూడాలన్నారు. జిల్లా ఆస్పత్రితో పాటు పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం అందించాలన్నారు. మందుల కొరత ఉంటే తనకు సమాచారం ఇవ్వాలన్నారు. తాండూరులో దోమల వ్యాప్తి నివారణకు పారిశుద్ధ్య పనులతో పాటు ఫాగింగ్ చేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు

శంకర్‌పల్లి: మండలంలోని చెందిప్ప గ్రామంలో వెలసిన 11వ శతాబ్దపు మరకత శివాలయాన్ని సోమవారం విశ్రాంత ఐఏఎస్ శరత్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. శరత్ దంపతులు లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. మరకత శివాలయాన్ని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు శరత్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు సదానందం, సభ్యులు హనుమంతు, అర్చకులు ప్రమోద్, వీరేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తులు 11,718 | 807 పరిష్కారం

భూ భారతి సమస్యల పరిష్కారానికి 14తో ముగిసిన గడువు



ఇటీవల పరిగి మండలంలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

- నోటీసులు జారీ చేసినవి 11,117
- అత్యధికంగా మిస్సింగ్ సర్వే నంబర్లే
- 10వ స్థానంలో జిల్లా

వికారాబాద్: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో భాగంగా రైతుల నుంచి తీసుకున్న అర్జీల పరిష్కారానికి ప్రభుత్వం విధించిన గడువు ముగిసింది. జూన్ 2 నుంచి కొత్త రెవెన్యూ చట్టం అమలులోకి రాగా 3వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కుప్పలు తెప్పలుగా అర్జీలు రావడంతో రెండు నెలలుగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. దరఖాస్తుల పరిష్కార గడువు ఈ నెల 14తో ముగిసింది. కేవలం పది శాతం లోపే పరిష్కారమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 11,718 దరఖాస్తులు రాగా కేవలం 807ని మాత్రమే పూర్తిస్థాయిలో పరిష్కరించారు. 11,117 సమస్యలకు సంబంధించి అర్జీదారులకు నోటీసులు జారీ చేశారు. మరో 2,147 చివరి దశకు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే సమస్యల పరిష్కారంలో జిల్లా 10వ స్థానంలో ఉంది.

ఆప్షన్ లేక దీలా..

భూ సమస్యల పరిష్కారం కోసం అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నా పెద్దగా ఫలితం కనిపించడం లేదు. కోర్టు పరిధిలో ఉన్న వివాదాలు, వ్యాజ్యాలు మినహా మిగిలిన వాటిని ఆగస్టు 14వ తేదీ నాటికి పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అనేక సమస్యలకు ఆప్షన్ లేకపోవడం అడ్డంకిగా మారుతోంది. వచ్చిన వాటిలో చాలా వరకు డబులు దరఖాస్తులు ఉన్నాయి. మీసేవా కేంద్రాలతో పాటు రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు ఇచ్చారు. సాదాబైనామా దరఖాస్తులపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

ఆ అర్జీలే అత్యధికం

గత ప్రభుత్వ హయాంలో భూ సమస్యల పరిష్కారం కోసం కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని సాధ్యమైనంత వరకు పరిష్కరించారు. అప్పట్లో కలెక్టర్ లాగిన్‌లో ఐదు వందల అర్జీలు మాత్రమే పెండింగ్‌లో ఉండేవి. రెవెన్యూ కొత్త చట్టం అమలులోకి రావడంతో మళ్లీ వేల దరఖాస్తులు వచ్చాయి. అందులో మిస్సింగ్ సర్వే నంబర్లు, సాదాబైనామా, అసైన్డ్ భూముల సమస్యలు, పీఓబీ, విరాసత్, మ్యుటేషన్, డేటా కరక్షన్ తదితర దరఖాస్తులు వచ్చాయి. మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించి 4,013, డీఎస్ పెండింగ్‌కు 1,604, సక్సేషన్‌కు 1,654, ఎక్స్టెంట్ మిస్సింగ్‌కు సంబంధించి 690 దరఖాస్తులు వచ్చాయి. అక్కడికక్కడే కొన్ని పరిపరిష్కరించినవి పోనూ మరో 11,718 దరఖాస్తులు వచ్చాయి.

త్వరగా పరిష్కరిస్తాం

జిల్లా వ్యాప్తంగా పది వేలకు పైగా అర్జీలు వచ్చాయి. ఇప్పటికే పరిశీలన, డేటా ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేశాం. కోర్టు పరిధిలో ఉన్న వాటిని, సాదాబైనామా సమస్యలకు సంబంధించి కోర్టు ఆదేశాల మేరకు పరిష్కరిస్తాం. డబుల్ దరఖాస్తులను పరిశీలించి తొలగిస్తాం.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్



పాల్గొన్న భక్తులు

నేత్రపర్వం.. శివపార్వతుల కల్యాణం



కల్యాణ శోభిత శివపార్వతులు

వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని పార్వతీపరమేశ్వరుల కల్యాణం నేత్ర పర్వంగా సాగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకం చేశారు. 11 గంటలకు వేద మంత్రోచ్చారణ నడుమ అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన నూతన షెడ్‌ను ప్రారంభించారు. వేడుకల్లో వీరశైవ సమాజం ప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, పట్టణ, ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– అనంతగిరి



కొడంగల్‌లోని రేషన్ దుకాణం



కొత్తగా ముద్రించిన బ్యాగు

రేషన్ డీలర్లకు అందని కమీషన్

- మూడు నెలలుగా ఎదురుచూపులు
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- వచ్చే నెల నుంచి బ్యాగుల్లో రేషన్ బియ్యం

కొడంగల్: ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లా రేషన్ డీలర్లకు మూడు నెలలుగా బియ్యం పంపిణీ కమీషన్ రావడం లేదు. సివిల్ సప్లయ్ ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ లోపం వల్ల జాప్యం జరుగుతోందని ఆరోపిస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం నుంచి కమిషన్ వచ్చేదని తెలిపారు. ఈ మధ్య కాలంలో కమీషన్ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై పడిందన్నారు. కిలో బియ్యం పంపిణీ చేస్తే కమీషన్ రూపంలో రూ.1.40 పైసలు వస్తాయి. ఈ లెక్కన ఒక్కో డీలర్‌కు నెలకు రూ.15 వేలకు తగ్గకుండా వస్తోంది. చాలా కాలంగా తమ వేతనాలు పెంచాలని డీలర్లు డిమాండ్ చేస్తున్నారు.

బియ్యానికి మాత్రమే పరిమితం

రేషన్ దుకాణాలు ఉచిత బియ్యానికి మాత్రమే పరిమితం అయ్యాయి. గతంలో 9 సరుకులు ఇచ్చేవారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న కమీషన్ ఏమాత్రం సరిపోదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం అమ్మిన తర్వాత మిగిలిన ఖాళీ సంచులు అమ్ముకుంటే వచ్చే డబ్బులతో పూట గడవడం లేదన్నారు.

జిల్లాలో 588 రేషన్ దుకాణాలు

జిల్లా వ్యాప్తంగా 588 రేషన్ దుకాణాలు ఉన్నాయి. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తికీ ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. 2.09 లక్షల ఆహార భద్రత కార్డులు, 25 వేల అంత్యోదయ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతి నెలా 5,200 టన్నుల బియ్యం అలాట్‌మెంట్ ఉంది.

ప్రత్యేక బ్యాగుల్లో..

సెప్టెంబర్ నెల నుంచి కొత్తగా ముద్రించిన బ్యాగుల్లో బియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే బ్యాగులు స్టాక్ పాయింట్లకు చేరినట్లు సమాచారం. రేషన్ బియ్యంతో పాటు బ్యాగులు కూడా ఉచితంగా ఇవ్వనున్నారు. బ్యాగుపై ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను ముద్రించారు. ఈ సంచి బయట కొనలాంటే రూ.50 ఖర్చు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.


కమీషన్ చెల్లించాలి

ప్రతి నెలా బియ్యం కమిషన్ చెల్లించాలి. ఈ మొత్తాన్ని కూడా పెంచాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు 9 రకాల సరుకులు ఇచ్చింది. అదే తరహాలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేస్తే బాగుంటుంది.

– కానుకుర్తి నర్సిరెడ్డి, డీలర్, కొడంగల్

గణేశ్ మండప వివరాలు తప్పనిసరి

- ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి
- ఎస్పీ నారాయణరెడ్డి



అనంతగిరి: గణేశ్ ఉత్స వాల నేపథ్యంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలోతెలిపారు. మండపాలు ఏర్పాటు చేసేవా రు పోలీసు శాఖ పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.ఇందుకోసం ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.మండపాల సమాచారం పోలీసుల వద్ద ఉంటే అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలకు సులభంగా ఉంటుందని తెలిపారు.

పాటించాల్సిన నిబంధనలు

- మండపం వద్ద షార్ట్ సర్క్యూట్ జరగకుండా నాణ్యమైన విద్యుత్ తీగల ను మాత్రమే ఉపయోగించాలి. విద్యుత్ వినియోగంలో జాగ్రత్తగా ఉండాలి.
- మండపం వివరాలు, కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్ మండపం వద్ద కనిపించేలా ప్రదర్శించాలి. స్థానిక పోలీస్ స్టేషన్, పోలీసు అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలి.
- మండపాల్లో డీజేలు, అధిక శబ్దం చేసే సౌండ్ సిస్టమ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించరాదు.
- విగ్రహం ప్రతిష్ఠించే ప్రదేశంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, నాణ్యమైన, పటిష్టమైన షెడ్ ఏర్పాటు చేయాలి.
- మండపంలో 24 గంటల పాటు ఒక వలంటీర్ ఉండాలి. భక్తుల కోసం క్యూ లైన్లను ఏర్పాటు చేసుకోవాలి.
- అగ్నిప్రమాదాల నివారణకు మండపం వద్ద ఇసుక బకెట్లు, నీరు అందుబాటులో ఉంచుకోవాలి.
- మండపం వద్ద ఒక పుస్తకాన్ని ఉంచి పోలీసులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో వివరాలు నమోదు చేసి సంతకం చేయించుకోవాలి.
- మండపం వద్ద ఏదైనా అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు సమాచారాన్ని, వదంతులను నమ్మరాదు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే పోలీసు అధికారులు లేదా డయల్ 100కు, లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ సెల్ నం. 87126 70056కు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలి.

పాపన్నగౌడ్ ఆశయాలు సాధిద్దాం

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఇతర అధికారులు

అనంతగిరి: బహుజనుల ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సబ్బండ వర్గాల సమానత్వం, వారి సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి తెలంగాణ గడ్డపై దళిత బహుజన మైనారిటీలతో కలిసి ప్రజా రాజ్యాన్ని నిర్మించిన మహోన్నత వ్యక్తి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్ డీఆర్‌ఓ మంగ్లీలాల్, ఆర్డీఓ వాసుచంద్ర, బీసీ వెల్ఫేర్ అధికారి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంది

వానాకాలం సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం నగరం నుంచి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యూరియా పంపిణీపై దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఆగస్టు నెలకు సంబంధించి 11,200 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, ఇప్పటి వరకు 4,250 మెట్రిక్ టన్నులు విక్రయించడం జరిగిందన్నారు. నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కలిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాజరత్నం, జనరల్ మేనేజర్ మహేశ్వర్, మార్కెటింగ్ శాఖ అధికారి సారంగా పాణి పాల్గొన్నారు.

సత్వరం పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్ ఉంచరాదని, సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 45 ఫిర్యాదులు వచ్చాయి. భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, విద్యుత్, గ్రామ పంచాయతీ, విద్యాశాఖ, ఆసరా పెన్షన్లకు సంబంధించి పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో మరమ్మతు పనులను పూర్తి చేయాలని సూచించారు. భారీ వర్షాలు పడుతున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ సుశీందర్‌రావు

- రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

ఇబ్రహీంపట్నం: అందివచ్చిన అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠల్‌లో రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్–15 బాలుర, బాలికల వాలీబాల్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యంతోపాటు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని అన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని, మేధో సంపత్తిని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభాపాటవాలు చాటాలని, క్రీడల్లో రాణించి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించే విద్యార్థులను పీఈటీలు, పీడీలు ప్రోత్సహించి, వారికి మంచి అవకాశాలు దక్కేలా తమవంతు కృషి చేయాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 25న పుణేలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. పోటీలకు ములుగు జిల్లా మినహా 32 జిల్లాల నుంచి సుమారు 700 మంది వాలీబాల్ క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో గురుకుల విద్యాపీఠల్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు, మండల విద్యాధికారి హీర్యానాయక్, పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, పీడీ, పీఈటీల సెక్రటరీ ఎండీ షబ్బీర్, క్రీడల అబ్జర్వర్ వెంకట్‌నారాయణ, జోనల్ సెక్రటరీ పీడీ సుశీల పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

కలెక్టర్‌కు అంగన్‌వాడీల వినతిపత్రం

అనంతగిరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యను నిర్వహించాలని అంగన్‌వాడీ టీచర్స్, వెల్ఫేర్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ, కార్యదర్శి ఎం.భారతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆరేళ్లలోపు చిన్నారుల కోసం వెలిసిన ప్రైవేటు స్కూళ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల్లోని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అనుభవం, అర్హత ఉన్నవారికి ప్రమోషన్లు ఇవ్వాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని నినదించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను రూ.5 లక్షలకు పెంచాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.32 వేలు చెల్లించాని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వర్షంలో తడుస్తూనే గొడుగులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మైహిపాల్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు లక్ష్మి, మంజుల, వనజ, బేబీ, రేణుక, వసంత, పుష్ప, అమృత తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

క్లుప్తంగా

రహదారులకు మరమ్మతులు చేయిస్తాం



అల్లాపూర్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంతను పరిశీలిస్తున్న ఆంజనేయులు ముదిరాజ్

కుల్కచర్ల: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామీణ రోడ్లు పాడయ్యాయని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామానికి వెళ్లే మెటల్ రోడ్డు వర్షానికి దెబ్బతిని గుంత ఏర్పడింది. దీంతో ఏఈ మణికుమార్, పంచాయతీ కార్యదర్శి మైమున బేగంతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాడైన రోడ్లను పరిశీలించి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తున్నామని, ఆయన అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మండలంలో ఎక్కడ రోడ్లు పాడైన, ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు గోపాల్, సతీష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

ఇబ్రహీంపట్నం: చెక్ బౌన్స్ కేసులో నిందితుడైన భాస్కర్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఇబ్రహీంపట్నం ఎంఎం కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు వెలువర్చారు. న్యాయవాది రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. బాధితుడు దయానంద్‌కు రూ.24,87,500 చెల్లించాలని, అలాగే భాస్కర్ ఏడాది జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారన్నారు.

శంకర్‌పల్లి ఎంపీడీఓ భార్య ఆత్మహత్య

లాలాపేట: శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య గౌడ్ భార్య ఉష(37) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ భార్య, ఇద్దరు కూతుళ్లతో కలిసి హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 4లోని హోమ్ సన్‌షైన్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొద్ది రోజులుగా మానసిక వేదన అనుభవిస్తున్న ఉష ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. ఓ వివాహానికి హాజరయ్యేందుకు వెళ్లిన వెంకయ్యగౌడ్ ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ సాయంతో తలుపులు బద్దలు కొట్టి, కిందకు దించగా అప్పటికే చనిపోయింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు బాడీని గాంధీ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డిఫాల్టర్లు చెల్లిస్తేనే.. మేమూ కడుతాం

అబ్దుల్లాపూర్‌మెట్: రైతుల ముసుగులో కొందరు రైతుసేవా సహకార సంఘం నుంచి అధిక మొత్తంలో రుణాలు పొంది, చెల్లించడం లేదని.. డిఫాల్టర్లు చెల్లిస్తేనే తాము చెల్లిస్తామని రైతులు స్పష్టం చేశారు. రుణాలను త్వరగా చెల్లించాలని సంఘం అధికారులు, సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ.. సోమవారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయం ఎదుట మజీద్‌పూర్ గ్రామ రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సాగు చేయని వారికి పెద్దమొత్తంలో రుణాలు ఇచ్చి, వసూలు చేయకుండా కాలం గడుపుతారని, చిన్న మొత్తం రుణంగా ఇచ్చి చిన్న సన్నకారు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రుణాలు మంజూరు చేసి, డబ్బులు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు. కొంత మంది 200 గజాల ప్లాటు తప్పుడు పత్రాలు పెట్టి, బ్యాంకులో రుణాలు పొందారని పేర్కొన్నారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకొని రుణాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రుణాలు పొంది సాగు చేయకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టి, రూ.కోట్లు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత అలాంటి వారి నుంచి రుణం వసూలు చేయాలని సూచించారు.

రాజకీయ లబ్ధికోసమే భూ ధారాదత్తం

బడంగ్‌పేట్: పేదలు సాగుచేసుకుంటున్న భూములను గత ప్రభుత్వం లాక్కొని.. రాజకీయ లబ్ధికోసం, ఓట్ల కోసం క్రైస్తవులకు దారాదత్తం చేసిందని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బొద్రమోని పురుషోత్తం ఆరోపించారు. సోమవారం కార్పొరేషన్ పరిధి కుర్మల్‌గూడలో జి.కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల భూములను నాటి బీఆర్ఎస్ సర్కార్ బలవంతంగా గుంజుకుందని విమర్శించారు. కుర్మల్‌గూడలో ఇళ్లులేని ఎంతో మంది పేదలు ఉన్నారని, వారికి 60 గజాలు కేటాయించడానికి మనస్సురాని బీఆర్ఎస్.. క్రైస్తవుల మెప్పు పొందడానికి వారి సమాధులకు ఎకరాల కొద్దీ స్థలాన్ని ఎలా కేటాయించిందని ప్రశ్నించారు. ఆ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని పేదలకు పంపిణీ చేయాలని కోరారు.

నీళ్లపల్లి.. భక్తజనం ప్రణమిల్లి

- వైభవంగా ఏకాంబరి రామలింగేశ్వరుడి ఉత్సవాలు
- సప్తకొలనులలో భక్తుల పుణ్యస్నానాలు





భక్తులతో కిక్కిరిసిన ఆలయ పరిసరాలు (ఇన్‌సెట్‌లో) అలంకరణలో స్వామివారు

బషీరాబాద్: జడివానలోనూ ఏకాంబరి రామలింగేశ్వరస్వామి జాతరకు భక్తజనం పోటెత్తారు. మండలంలోని నీళ్లపల్లి అటవీ ప్రాంతంలోని సప్తకొలనులలో వెలసిన స్వామి వారి దర్శనం కోసం సోమవారం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు గ్రామాల నుంచి వనాన్ని లెక్కచేయకుండా భక్తులు భారీగా కదిలి వచ్చారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన రామలింగేశ్వరుడి ఆలయం చుట్టు ఉన్న సప్త కొలనులలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. తాండూరు, మహబూబ్‌నగర్ పట్టణాలతో పాటు కర్ణాటకలోని సేడం తాలుకా నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు నడపడంతో వేలల్లో భక్తులు దర్శించుకున్నారని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

యాకూబ్‌సాబ్ దర్గాకు పూజలు

రామలింగేశ్వర స్వామి వారి దర్శనం అనంతరం భక్తులు కొలనులోని యాకూబ్‌సాబ్ దర్గాను దర్శించుకున్నారు. పూలు, పండ్లు పెట్టి మొక్కు తీర్చుకున్నారు. అలాగే ముస్లిం భక్తులు కూడా అధిక సంఖ్యలో హాజరై దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

వైభవంగా రథోత్సవం

స్వామి వారి రథాన్ని ఆలయ ధర్మకర్తల మండలి రకరకాల పూలతో అందంగా అలంకరించారు. రథంపై ఉత్సవమూర్తిని ఉంచి భక్తులు వీధుల గుండా ఊరేగించారు. ఈ జాతరకు ఎక్కువగా గ్రామీణ ప్రాంత ప్రజలు హాజరు కావడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతరలో మిఠాయి దుకాణాలు, ఆటబొమ్మల దుకాణాలు, గాజుల దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి.

చీఫ్ విప్, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వర స్వామిని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి వేరువేరుగా వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరణం పురుషోత్తం రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, నాయకులు సుధాకర్‌రెడ్డి, రుక్మారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

వర్షం జోరు.. వరద హోరు

దోమ/ధారూరు: జోరుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. రహదారులన్నీ జలమయమై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. సోమవారం ధారూరు మండల పరిధిలోని రుద్రారం–నాగసమందర్ గ్రామాల మధ్య కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు పారి రోడ్డుపై వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో రాకపోకలను కొన్ని గంటల పాటు స్తంభింపజేశారు. దోమ మండలం బ్రాహ్మణపల్లిలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో అటుగా రాకపోకలు బంద్ అయ్యాయి. అధికారులు వాహనదారులు వెళ్లకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పొలాల్లోకి వరద చేరడంతో పంటలు నీట మునిగాయి.



దోమ: ఉధృతంగా ప్రవహిస్తున్న బ్రాహ్మణపల్లి వాగు



ధారూరు: రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

ఓపెన్ వర్సిటీలో ఉపాధి అవకాశాలు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు, సిబ్బంది

కొడంగల్ రూరల్: సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ వర్సిటీ విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో చేరిన విద్యార్థులకు ఆర్ఏఎస్‌సీఐ(రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కమర్షియల్ ఆఫ్ ఇండియా) వారితో ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశం కల్పిస్తున్నట్లు, మహిళలకు ఉమెన్ ఎంటర్ ప్రైజెస్ ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్ పాసైనవారు ఈ నెల 30వ తేదీలోపు అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. దివ్యాంగులకు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత విద్య నందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఓపెన్ వర్సిటీకి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్, ఓపెన్ వర్సిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఇరుకు చౌరస్తా.. ప్రయాణం అవస్థ

- కొడంగల్ వినాయక కూడలిలో వాహనదారుల ఇక్కట్లు
- ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని వినతి



ఇరుగ్గా ఉన్న కొడంగల్ వినాయక చౌరస్తా

కొడంగల్: పట్టణంలోని వినాయక చౌరస్తాను విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ వసతి గృహాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు వినాయక చౌరస్తా సమీపంలో ఉన్నాయి. నిత్యం వేలాది మంది విద్యార్థులు తిరుగుతుంటారు. ప్రతి రోజు ఈ ప్రాంతం రద్దీగా ఉంటోంది. ప్రయాణికులను ఎక్కించుకోడానికి దించడానికి ఆర్టీసీ బస్సులు కూడా ఇక్కడనే ఆపుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో వినాయక చౌరస్తాను విస్తరించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని పట్టణ వాసులు కోరుతున్నారు. నియోజకవర్గంలోని కొడంగల్, కోస్గి పట్టణాల్లో ప్రధాన కూడళ్ల విస్తరణకు జాతీయ రహదారుల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. మహబూబ్‌నగర్–చించోలీ(ఎంసీ) అంతర్రాష్ట్ర రహదారిని కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిగా మార్చింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి కొడంగల్, తాండూరు మీదుగా కర్ణాటక రాష్ట్రం చించోలీ వరకు జాతీయ రహదారిని నిర్మిస్తున్నారు. ఈ జాతీయ రహదారికి 167ఎన్‌గా పేరు పెట్టారు.

విస్తరణకు రూ.630 కోట్లు

మహబూబ్‌నగర్ నుంచి హన్వాడ, గండీడ్, కోస్గి, కొడంగల్, తాండూరు మీదుగా ఈ రహదారిని నిర్మిస్తున్నారు. బెంగళూరు, ముంబాయి జాతీయ రహదారులను కలిపే ఈ రహదారి సుమారు 150 కిలోమీటర్లు పొడవు ఉంది. వికారాబాద్ జిల్లాలో 45 కిలోమీటర్లు, కర్ణాటక రాష్ట్రంలో 50 కిలోమీటర్లు, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 55 కిలోమీటర్ల మేర రహదారి విస్తరించి ఉంది. మహబూబ్‌నగర్–చించోలీ(ఎంసీ) జాతీయ రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.630 కోట్లు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. మహబూబ్‌నగర్, కోస్గి, కొడంగల్, తాండూరు మీదుగా చించోలి, మన్నాకెళ్లి వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వినాయక చౌరస్తాను విస్తరిస్తే ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఉండవని స్థానికులు కోరుతున్నారు.

> **పనులు వేగవంతం చేయాలి**
>
> 
>
> మహబూబ్‌నగర్–చించోలీ(ఎంసీ రోడ్డు) జాతీయ రహదారి పనులను వేగవంతం చేయాలి. వినాయక చౌరస్తాలో ప్రతి రోజు ట్రాఫిక్ జాం అవుతుంది. రాకపోకలు సాగించడానికి విద్యార్థులకు, స్థానికులకు అంతరాయం ఏర్పడుతోంది. జాతీయ రహదారి పనుల్లో భాగంగా వినాయక చౌరస్తాను విస్తరించి సమస్యలు పరిష్కరించాలి.
>
> – నర్సిరెడ్డి, కొడంగల్

యథేచ్ఛగా డీజిల్ దందా!

- కర్ణాటక నుంచి అక్రమంగా తరలింపు
- తెలంగాణ కన్నా పొరుగు రాష్ట్రంలో రూ.10 తక్కువ
- రోజుకు వేల లీటర్లు నగరానికి రవాణా
- కోట్లలో దందా.. బడా నాయకుల అండ
- పోలీసులకు భారీగా ముడుపులు

పరిగి: పక్క రాష్ట్రం కర్ణాటకలో డీజిల్ ధరలు తక్కువ ఉండటంతో అదే ఆసరగా చేసుకుని కొందరు అక్రమ దందాను యథేచ్ఛగా నడిపిస్తున్నారు. జిల్లా మీదుగా రోజుకు వేల లీటర్ల నగరానికి తరలిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. భారీగా ముడుపులు అందుతుండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. అధికారులు, అధికార పార్టీ నాయకుల అండదండలతో అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. రెండేళ్లుగా ఈ వ్యవహారం నడుస్తున్నా ఎవరికీ పట్టడం లేదు. కర్ణాటక నుంచి కొడంగల్, పరిగి మీదుగా హైదరాబాద్‌లోని ఓ పెట్రోల్ బంక్‌కు రెండు ట్యాంకర్లు వెళుతున్నట్లు సమాచారం. లీడరు డీజిల్ తెలంగాణతో పోలిస్తే కర్ణాటకలో తొమ్మిది రూపాయలు తక్కువ. ఇంత వ్యత్యాసం ఉండటంతో పొరుగు రాష్ట్రం నుంచి నిత్యం రెండు ట్యాంకర్ల ద్వారా డీజిల్ నగరానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఒక్కో ట్యాంకర్ ద్వారా రూ.లక్ష వరకు అక్రమంగా ఆదాయం పొందుతున్నట్లు సమాచారం. గతంలో మన్నేగూడ, పరిగిలో పోలీసు అధికారులు ట్యాంకర్లను ఆపి విచారించగా ఉన్నతాధికారుల, రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో వదిలేసినట్టు తెలిసింది.

సరిహద్దు చెక్‌పోస్టు దాటి

తెలంగాణ.. కర్ణాటక సరిహద్దుల్లో ఆయా రాష్ట్రాల చెక్‌పోస్టులు ఉన్నాయి. ఈ రెండింటిని అక్రమార్కులు మ్యానేజ్ చేస్తున్నట్లు తెలిసింది. కొన్ని సంవత్సరాలుగా ఈ వ్యవహారం గుట్టుగా సాగుతోంది. ఉన్నతాధికారులపై వైఫల్యానికి ఈ చెక్‌పోస్టులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు డీజిల్ అక్రమ దందాపై దృష్టి సారించి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

శంకర్‌పల్లి: వినాయక మండపాలు ఏర్పాటు చేసే వారు పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్, సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం శంకర్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గణేశ్ పండగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించుకోవాలని, డీజేలకు ఎలాంటి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి సౌండ్ సిస్టం పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో పలువురికి జైలు

ఇబ్రహీంపట్నం రూరల్: మంగల్‌పల్లి రెవెన్యూ పరిధిలో ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని చెప్పి, మోసం చేసిన కేసులో పలువురికి జైలు శిక్ష విధిస్తూ సోమవారం న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. దోషులుగా తేలిన బాలాజీ, అమృతమ్మ, ఆర్.శంకర్‌నాయక్, ఎం.రాజ్‌గోపతో పాటు మరో ఇద్దరుకి మూడేళ్ల జైలుతో పాటు జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం కోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌సింగ్ తీర్పు వెల్లడించారు.

ఫాగింగ్.. పరేషాన్!

- దోమకాటుకు పల్లెలు విలవిల
- మూలనపడిన యంత్రాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



దౌల్తాబాద్‌లో ఇళ్ల మధ్య చెట్లపొదలు



ఈర్లపల్లిలో నిరుపయోగంగా ఫాగింగ్ మిషన్

దౌల్తాబాద్: దోమకాటుతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణకు గత ప్రభుత్వ హయాంలో వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్లు చాలా పంచాయతీల్లో చెడిపోగా.. మరికొన్నింటిలో మిషన్లు మాయమయ్యాయి. దోమకాటుకు పల్లెవాసులు విలవిలలాడుతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు ఇతర వైరల్ జ్వరాలు తాండవం చేస్తున్నాయి. దోమల నివారణకు కొనుగోలు చేసిన యంత్రాలు పంచాయతీల్లో లేకపోవడం గమనార్హం. అప్పటి ప్రభుత్వం ఒక్కో యంత్రానికి రూ.35వేల నుంచి రూ.40వేలు వెచ్చించి కొనుగోలు చేసింది. కొన్ని గ్రామాల్లో మేజర్ పంచాయతీల నుంచి అడపాదడపా తీసుకుని పారిశుద్ధ్య కార్మికులు ఫాగింగ్ చేస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో యంత్రాలు మాయం కావడంతో పక్కన పంచాయతీల నుంచి తీసుకురావాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇటీవల స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేయించాలని అధికారులు సూచనలు చేస్తున్నప్పటికీ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. డీజిల్, పెట్రోలు, లిక్విడ్‌లను సమ పద్ధతుల్లో వినియోగించకపోవడంతో యంత్రాలు చెడిపోయినట్లు తెలుస్తోంది.

ఖర్చు తడిసి మోపెడు

మండలంలోని చాలా గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు మరమ్మతులు చేయించలేక మూలనపడేశారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. చెడిపోయిన యంత్రాలకు మరమ్మతులు చేయించాలంటే చాలా ఖర్చులు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోమల స్వైరవిహారం

గ్రామ పంచాయతీల్లో వారంలో రెండుసార్లు ఫాగింగ్ చేపట్టాల్సి ఉంటుంది. వర్షాకాలం సీజన్ ప్రారంభంలో వీటి వినియోగం మరింత ఎక్కువ చేసినప్పుడే దోమలను సగం వరకు నియంత్రణ చేయవచ్చు. గ్రామం మొత్తంగా నెలలో ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయడం లేదు. ఒకసారి పిచికారీ చేసిన ఫొటోలనే ప్రతి నెలా వినియోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టకపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.

> **ఆదేశాలు జారీ చేశాం**
>
> ప్రతి గ్రామంలో దోమల నివారణ కోసం మందును పిచికారీ చేయాలని కార్యదర్శులకు సూచనలు చేశాం. కొన్ని గ్రామాల్లో ఫాగింగ్ మిషన్లు పాడైనట్లు తెలిసింది. వాటిని మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. వ్యాధుల తీవ్రత దృష్ట్యా పారిశుద్ధ్య నిర్వహణకు నిరంతరం పర్యవేక్షించేలా కృషి చేస్తాం.
>
> – శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్

శ్రావణమాసం.. పూజలు ప్రత్యేకం



తాండూరు టౌన్: స్వామివారు



దౌల్తాబాద్‌లో శివలింగాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

తాండూరు టౌన్: చివరి శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని తాండూరు పట్టణంలోని శ్రీభావిగి భద్రేశ్వర స్వామి దేవస్థానంలోని శివాలయంలో పరమశివుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా రాయచోటి పట్టణంలో వెలసిన శ్రీ వీరభద్రేశ్వర స్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

దౌల్తాబాద్‌లో ఊరేగింపు

దౌల్తాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో సోమవారం శ్రావణమాస ముగింపు పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దౌల్తాబాద్‌లోని నీలకంఠస్వామి ఆలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకం, పల్లకీసేవ చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం చేశారు.

జినుగుర్తిలో మండలి చీఫ్ విప్..

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గ్రామ శివారులో ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రావణమాసం చివరి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్తలు కరమ్‌చందు, ఉత్తమ్‌చందు, మోహన్‌దాస్, రఘుకిషోర్, అనంతయ్య, జగదాంబ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి దర్శించుకొని పూజలు చేశారు.

ఘనంగా జాతర

మోమిన్‌పేట: శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో రాళ్లగుడుపల్లి పరిధిలోని రామలింగేశ్వర స్వామి జాతర ఘనంగా జరిగింది. ఆదివారం రాత్రి మొదలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం భక్తులు లెక్క చేయకుండా స్వామివారి అభిషేకంలో మునిగి తేలారు.

అంబు రామేశ్వరంలో పూజలు

తాండూరు రూరల్: తెలంగాణ–కర్ణాటక సరిహద్దులోని పెద్దేముల్ మండలం తట్టెపల్లి–పాషాపూర్ గ్రామ సమీపంలో ఉన్న అంబు రామేశ్వరస్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో భక్తులు ఉపవాసం దీక్షలు విరమించారు. అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్‌తో పాటు పలువురు స్వామివారిని దర్శించుకున్నారు.



తాండూరు రూరల్: జినుగుర్తిలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు